కంకర రోడ్డుతో కష్టాలెన్నో..



తారువేయని పాన్నేకల్ రోడ్డు

పాన్నేకల్ రోడ్డుకు కలగని మోక్షం
- కంకర పోశారు.. తారు మరిచారు..
- ఏళ్లుగా ముందుకు కదలని పనులు
- ప్రభుత్వం మారినా అదే నిర్లక్ష్యం
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు

కామేపల్లి: ఆర్అండ్‌బీ నిర్లక్ష్యం.. పాన్నేకల్ గ్రామ ప్రజలకు శాపంగా మారింది. గత పదేళ్లుగా దుమ్ము, ధూళితో అనారోగ్యబారిన పడుతూ నానా అవస్థలు పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. పాన్నేకల్–పుల్లూరు రోడ్డుకు మోక్షం ఎప్పుడు లభిస్తుందోనని ఆయా గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు. ఏళ్ల తరబడిగా సాగిన రోడ్డు నిర్మాణ పనుల్లో కంకర పోసి తారు వేయడం మరిచారు. ప్రభుత్వం మారినా పనికావడం లేదంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంకర తేలి ప్రమాదాలు..

పాన్నేకల్ మీదుగా కారేపల్లి మండలం పుల్లూరు, కమలాపురం, గుబ్బతండా, మేకలతండా, గేటు కారేపల్లి, ఇల్లెందుకు నిత్యం వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. ఈక్రమంలో రోడ్డుపై వేసిన కంకర తేలగా.. వాహనాల రాకపోకలతో దుమ్ము లేవడంతో ప్రయాణ సమయాన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో వాహనాలు అదుపుతప్పి కిందపడి గాయాలపాలైన సంఘటనలు ఉన్నా పట్టించుకోకపోవడం గమనార్హం.

నత్తనడకన పనులు..

బీటీ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి పార్ట్ 2 కింద ఆర్అండ్‌బీ అధికారులు అగ్రిమెంట్ ఇవ్వకపోవడంతో గత పదేళ్లుగా సదరు కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. ఈ సమస్యను స్థానికులు ఎమ్మెల్యే, మంత్రుల దృష్టికి తీసుకెళ్లడంతో పర్మిషన్ ఇవ్వాలని అధికారులను ఆదేశించినా పనులు జరగడం లేదు. ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పనులు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని మిగిలిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు

రూ.31 కోట్లతో పనులు..

పాన్నేకల్ నుంచి పుల్లూరు మీదుగా ఇల్లెందు వరకు సుమారుగా 24 కిలోమీటర్లు ఉన్న సింగిల్ బీటీ రోడ్డును డబుల్ బీటీ రోడ్డుగా మార్చేందుకు గత ప్రభుత్వం రూ.31 కోట్ల నిధులను మంజూరు చేసింది. దీంతో అప్పటి ప్రజాప్రతినిధులు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినా.. గదేళ్లుగా పనులు అలాగే నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ ఉన్న బీటీ రోడ్డును తొలగించి డబుల్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా కంకర పోసి చదును చేసి ఇల్లెందు నుంచి పుల్లూరు వరకు డబుల్ బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా పుల్లూరు నుంచి పాన్నేకల్ వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర తారు పోయకుండా వదిలేశాడు. దీంతో అసలు రోడ్డు నిర్మాణం ప్రధాన సమస్యగా మారిపోయింది. డబుల్ రోడ్డు నిర్మాణం జరిగితే గ్రామాభివృద్ధి చెందడంతోపాటు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని భావించిన ఆయా ప్రాంతాలవారికి సంతోషం కలలాగే మిగిలిపోయింది.

అధికారుల నిర్లక్ష్యమే..



ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతో పాన్నేకల్ బీటీ రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేపట్టి వదిలేశాడు. దీంతో రోడ్డుపై కంకర తేలి ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

– గింజల నరసింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, పాన్నేకల్

పదేళ్లయినా పూర్తి కాలేదు..



బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి పదేళ్లయినా పూర్తి కాలేదు. రోడ్డుపై పోసిన కంకర తేలి దుమ్ము లేచి ఇళ్లల్లోకి వస్తుంది. వాహనాలు వెళ్తున్న క్రమంలో రాళ్లు లేచి వచ్చి తగిలిన సంఘటనలో గాయాలపాలనవుదున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి.

– వల్లభనేని అశోక్, పాన్నేకల్

పాఠశాలకు వెళ్లలేకపోతున్నాం..



బీటీ రోడ్డుపై కంకర తేలి ఉండడంతో పాఠశాలకు వెళ్లాలంటే భయంగా ఉంది. వాహనాలు వెళ్తున్న క్రమంలో రాళ్లు తగిలి గాయాలైన సంఘటనలు ఉన్నవి. పాఠశాల రోడ్డు పక్కనే ఉండడంతో దుమ్ము లేచి తరగతి గదిలోకి వస్తుంది. చాలా ఇబ్బందిగా ఉంది.

– నాగండ్ల యశస్వి, విద్యార్థి

ప్రతిపాదనలు పంపాం..

ఇల్లెందు నుంచి పాన్నేకల్ వరకు డబుల్ బీటీ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.31 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కాగా ఆ నిధులు సరిపోవకపోవడంతో సుమారు 4 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయి. అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. అవి రాగానే పనులు పూర్తి చేస్తాం.

– జి.ప్రవీణ్, ఆర్అండ్‌బీ ఏఈఈ, ఏన్కూర్

క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెం గ్రామంలో కొలువుదీరిన శ్రీ గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ తల్లి కల్యాణ మహోత్సవాన్ని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రసాద్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించి అమ్మవారికి కల్యాణతంతు నిర్వహించారు. భక్తులు కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఊరేగించడంతో గ్రామంలో పండుగ వాతావరణం సంతరించుకుంది.

ఎస్సెస్సీ విద్యార్థులకు పరీక్ష సామగ్రి

నేలకొండపల్లి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు చేతన ఫౌండేషన్ ఆధ్వర్యాన పరీక్ష సామగ్రి కిట్లను పంపిణీ చేశారు. మండలంలోని నాచేపల్లి పాఠశాలలో మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు చేతుల మీదుగా అందించారు. ఫౌండేషన్ జాయింట్ కార్యదర్శి సీతారామయ్య, సభ్యులు సురేష్, చంద్రకాంత్ నవీన్, రషీద్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

మా భూమి ఇప్పించండి

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరెంపులలో సర్వే నంబర్ 169బైఈలో గల తమ భూమిని అధికారులు తనకు ఇప్పించాలనిఅదే గ్రామానికి చెందిన బి.నాగేశ్వరరావు కోరారు. గురువారం మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2002 నుంచి 2018 వరకు ఆ భూమి పహాణీలో అనుభవదారు కాలంలో తమ కుటుంబసభ్యుల పేరుపై ఉందని, అనంతరం కొంతమంది వ్యక్తులు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి పాస్ పుస్తకాలు పొందారని పేర్కొన్నారు. ఈ విషయంపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, ఉన్నతాధికారులు తనకు న్యాయం చేయాలని కోరారు.

దానవాయిగూడెం విద్యుత్ సర్వీస్ తనిఖీ



తనిఖీ చేస్తున్న విద్యుత్ అధికారులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ వేసవి ప్రణాళికలో భాగంగా ఎన్పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ అధికారుల బృందం బుధవారం నగరంలోని దానవాయిగూడెం రూరల్ వాటర్ స్కీం(ఆర్‌డబ్ల్యూస్) తనిఖీ చేశారు. తనిఖీ బృందంలో ఉన్న టెక్నికల్ డీఈ బాబూరావు ఆర్‌డబ్ల్యూఎస్ సర్వీస్ నిర్వహణపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అంతరాయాలు లేని నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. ప్రస్తుత పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం టౌన్-1 ఏడీఈ నాగార్జున, కమర్షియల్ ఏడీఈ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

కూసుమంచి: ఇంటర్ సెకండియర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కాగా మండలంలో తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. కస్తూర్బా కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీ చేయగా.. డీఓ నాగలక్ష్మి, సీఎస్ అజితకుమారి పర్యవేక్షించారు. కాగా, పరీక్షకు హాజరైన కొందరు విద్యార్థులు పరీక్ష అనంతరం గంగబండతండా సమీపంలోని కస్తూర్బా కళాశాల నుంచి కూసుమంచికి సుమారు రెండున్నర కిలోమీటర్లు ఎండలో నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చింది.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్



కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	3
వంకాయ	24		20
బెండకాయ	54	పాలకూర	3
పచ్చిమిర్చి	28		20
కాకర	48	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	48	తోటకూర	3
దొండ	44		20
పొట్లకాయ	54	గోంగూర	4
చిక్కుడు	68		20
గోరుచిక్కుడు	48	మెంతికూర	2
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	28		40
చామగడ్డ	44	పుదీన	1
క్యారెట్	28		25
క్యాప్సికం	44	-ఖమ్మం వ్యవసాయం	

భోజన నాణ్యతలో రాజీ పడొద్దు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

నేలకొండపల్లి: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన నాణ్యతలో రాజీ పడొద్దని ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. గురువారం మండలంలోని మంగాపురంతండాలోని వివిధ పనులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తొలుత అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలించాక నర్సరీలో మొక్కలను, పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కంపోస్ట్ షెడ్‌ను సందర్శించి పలు సూచనలు చేశారు. మెనూ కచ్చితంగా అమలు చేయాలని, నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నర్సరీలో మొక్కలను సంరక్షించాలని, తడి చెత్త, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలని, పంచాయతీ పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఎస్.రాధాకృష్ణ, హెచ్ఎం నందిగామ ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

117 డిగ్రీ కళాశాలల ఫలితాలు విడుదల చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ కోర్సుల డిగ్రీ మొదటి, మూడవ, ఐదో సెమిస్టర్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. కాగా, వర్సిటీ పరిధిలోని 117 కళాశాలల ఫలితాలు యూనివర్సిటీ అధికారులు నిలిపివేశారని, ఈ ఫలితాలు తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేయూ పరిధిలో 304 డిగ్రీ కళాశాలలు ఉంటే వాటిలో కొన్ని కాలేజీ యాజమాన్యలు బకాయిలు చెల్లించలేదని సెమిస్టర్ ఫలితాలు నిలిపివేయడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. తక్షణమే ఫలితాలు విడుదల చేయాలని, లేనిపక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యాల్లో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ కాలేజీ విద్యార్థుల ప్రతిభ..

నేలకొండపల్లి: డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు కె.సాయి, హితేష్, వెన్నలలు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి తెలిపారు. గురువారం ప్రతిభ చూపిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు. ఈ సమావేశంలో కో-ఆర్డినేటర్ ఎస్.నారాయణస్వామి, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించండి

తిరుమలాయపాలెం: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పిండిప్రోలు కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అధిక నిధులు కేటాయించాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, ఖమ్మం జిల్లాలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు గాంధీ, రాకేష్, మండల నాయకులు మల్లేష్, అఖిల్, రవిచంద్ర, నాగార్జున తదితులు పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సవ సంబరాలు..

నేలకొండపల్లి/ఖమ్మంఅర్బన్: ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడంతో గురువారం పార్టీ శ్రేణులు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యాన విజయోత్సవ ర్యాలీ నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. రానున్న ప్రతీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణారావు, దుర్గారావు, షేక్ షర్ఫుద్దీన్, సూరేపల్లి జ్ఞానరత్నం, కళ్యాణం నాగేశ్వరరావు, దివాకర్, అడపాల శ్రీను, వీరబాబు, కంటి లక్ష్మీనారాయణ, గోపి, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మంలో ఖమ్మం అర్బన్, టౌన్ అధ్యక్షుడు కుమిలి శ్రీనివాసరావు ఆధ్వర్యాన బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచారు. మల్కా కొమరయ్య, చిన్న మైల్అంజిరెడ్డిల గెలుపుతో రాష్ట్రంలో బీజేపీకి మంచి పరిణామాలు రాబోతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గుత్తా వెంకటేశ్వరరావు, వైరా అసెంబ్లీ కన్వీనర్ నెల్లూరు కోటేశ్వరరావు, రాము ఆచంటి కోటేశ్వరరావు, హుస్సేన్, సీతారాములు, అంజన్న, వెంకన్న, ఉపేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంఅర్బన్: బాణాసంచా కాలుస్తూ సంబరాలు చేస్తున్న నాయకులు

కేఎంసీ సమాచారం..

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 18వ డివిజన్ ఖాళీ ప్లాట్‌లో పిచ్చి మొక్కలు మొలచి ఇబ్బంది కలుగుతోందని ఫిర్యాదులు రాగా.. తక్షణమే స్పందించిన మున్సిపల్ సిబ్బంది ఖాళీ ప్లాట్స్‌ను శుభ్రం చేయించారు.
- స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా డివిజన్‌కు 20 మంది వర్కర్లతో 5వ, 17వ, 21వ, 39వ, 48వ, 51వ డివిజన్లలో కాల్వలను శుభ్రం చేయించి.. వ్యర్థాలను ట్రాక్టర్ ద్వారా తొలగించారు. రోడ్డుపక్కన ఉన్న పిచ్చి మొక్కలు, రోడ్డు పైన ఉన్న డిబెరిస్, మట్టి కుప్పలు తొలగించారు.
- నగరంలోని 44వ డివిజన్‌లో అన్ని సౌకర్యాలతో సిద్ధమవుతున్న రైతుబజార్‌ను గురువారం ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారు. తుది దశకు చేరుకున్న నిర్మాణ పనులను అధికారులు పరిశీలించారు.
- నగరంలోని వైరారోడ్‌లో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను మున్సిపల్ అధికారులు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది.. డీఆర్ఎఫ్ సిబ్బందితో కలిసి తొలగించారు.

06కేసీఎం242: పిచ్చి మొక్కలు తొలగిస్తున్న కార్మికులు

ఈజీఎస్ నిర్మాణ పనుల పరిశీలన



తిరుమలాయపాలెంలో పౌల్ట్రీషెడ్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

తిరుమలాయపాలెం: మండలంలోని తిప్పారెడ్డిగూడెం, తిరుమలాయపాలెం గ్రామాల్లో ఈజీఎస్ ద్వారా చేపడుతున్న పౌల్ట్రీ షెడ్ నిర్మాణ పనులు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలను గురువారం ఈజీఎస్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనుల పురోగతిని తెలుసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీఓ నర్సింహారావును ఆదేశించారు.

పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

ఖమ్మం మామిళ్లగూడెం: పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా చర్యలు చేపట్టాలని పర్యావరణ మిత్ర జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ కడవెండి వేణుగోపాల్ కోరారు. గురువారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 2న హైదరాబాద్, 4న ఖమ్మంలో జరిగిన తన కుమారుడి వివాహ వేడుకలో అతిథులకు మొక్కలు, జ్యూట్ బ్యాగులు అందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కళాపరిషత్ అధ్యక్షుడు పగిడిపల్లి రాజారావు, అన్నం ఫౌండేషన్ మేనేజర్ కేశవపట్నం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఏఎంఓ రవికుమార్

ఖమ్మంసహకారనగర్: రెండో తరగతి ఎఫ్ఎల్ఎస్ అసెస్‌మెంట్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఏఎంఓ రవికుమార్ తెలిపారు. ఈనెల 10 నుంచి 12 వరకు నిర్వహించే సర్వేలో పాల్గొనే ఫీల్డ్ అసిస్టెంట్లకు గురువారం డైట్ కళాశాలలో శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణలో చెప్పే అంశాలను శ్రద్ధగా వినాలని కోరారు. శిక్షణలో కోర్సు డైరెక్టర్‌గా డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ వ్యవహరించారు. డీఆర్‌పీలుగా ఎస్.అనిల్‌కుమార్, కె.వెంకటేశ్వరరెడ్డి వ్యవహరించారు.

ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న బండి రమేష్

కూసుమంచి: ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను నిలదీసేందుకు పార్టీ శ్రేణులు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ పిలుపునిచ్చారు. గురువారం కూసుమంచిలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా హామీలను సక్రమంగా అమలు చేయలేక ప్రజలను మాయ మాటలతో మోసం చేస్తుందని విమర్శించారు. పరిపాలనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలను పరిష్కరించే దిశగా పార్టీ ఆధ్వర్యాన భవిష్యత్‌లో చేపట్టే పోరాటాలకు ప్రజలు మద్దతు పలకాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యుడు మల్లెల సన్మంతరావు, మండల కమిటీ సభ్యులు బిక్కసాని గంగాధర్, శీలం గురుమూర్తి, కర్ణబాబు, గన్యానాయర్, వెంకటేశ్వరరావు, వీరారెడ్డి, శ్రీను, నర్సింహారావు, వెంగళరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాదారుల ఉన్నతే లక్ష్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జీఎం, డీజీఎం

ఖమ్మంగాంధీచౌక్: ఖాతాదారుల ఉన్నతే లక్ష్యంగా బ్యాంకు సేవలందిస్తుందని యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ కేఎస్‌డీ శివ వరప్రసాద్ తెలిపారు. బుధవారం పార్కు కన్వెన్షన్‌లో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యాన ఎంఎస్ఎంఈ ఔట్రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఖాతాదారులకు అన్ని రకాల రుణాలకు ఆన్‌లైన్ సౌకర్యాన్ని కల్పించిందని ఖాతాదారులు వినియోగించుకోవాలన్నారు. ఆతర్వాత బ్యాంకు ఖమ్మం రీజియన్ హెడ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. బ్యాంకు ఆధ్వర్యాన యూనియన్ నారీశక్తి పథకంతో మహిళలకు రుణాలు అందించడంతో పాటు మహిళల్లో చైతన్యం కలిగించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం డీఐసీ చైర్మన్ సీతారాం నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు సబ్సిడీల గురించి వివరించాక అర్హులైన వారికి ఎంఎస్ఎంఈ రుణాల మంజూరు పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు, సుధాకర్ పీవీసీ పైప్స్ ఎండీ మీలా రవిశంకర్, బ్యాంక్ ఏజీఎంలు సర్వేశ్, సుధాకర్‌రావు, బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 7న వీరనారీమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యాన ఖమ్మం పాత బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్‌లో 'రాజ్యాంగం బహుజన మహిళలు సాధికారత'అనే అంశంపై నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్ర బాయి, లీగల్ అడ్వైజర్ షేక్.నజీమా, జిల్లా ఉపాధ్యక్షురాలు భూక్యా జ్యోతి, కార్యదర్శి చందు గురువారం ఒక ప్రకటనలు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

● కార్పెంటర్ల బంద్‌ను..



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: కార్పెంటర్ల డిమాండ్ల సాధనకు ఈనెల 17 నుంచి 26 వరకు నిర్వహించే బంద్‌ను జయప్రదం చేయాలని కార్పెంటర్ల జేఏసీ పిలుపునిచ్చింది. గురువారం కార్పెంటర్ల జేఏసీ కన్వీనర్ చిన్న బాణాల వీరబ్రహ్మాచారి ఆధ్వర్యాన వర్తక సంఘ భవనంలో జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. ఇందులో మూడు యూనియన్లు ఒకే తాటి మీదికి వచ్చికూలి రేట్లు పెంచాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి సోమా నాగరాజుకుమార్, కార్పెంటర్ మేస్త్రీలు, వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దోనోజు పాపాచారి, ప్రధాన కార్యదర్శి దిగజర్ల వెంకన్న, ఖమ్మం పట్టణ దుగోడ మిషన్ కార్పెంటర్ మేస్త్రి, వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దొనోజు శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి సందూరి నాగాచారి, కార్పెంటర్ జేఏసీ కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

● సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని..

నేలకొండపల్లి: ఖమ్మంలో ఈ నెల 9న నిర్వహించే రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) వర్ధంతిని జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలో వర్ధంతి పోస్టర్లను ఆవిష్కరించాక ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పగిడికత్తుల రామదాసు, చిర్రా భిక్షం, కూరపాటి వెంకటేశ్వర్లు, గూడెల్లి పెద్దవెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలం

నేలకొండపల్లి: మహిళల సమస్యల పరిష్కారంలో పాలకుల విఫలమయ్యారని సీఐటీయూ జిల్లా నాయకులు బెల్లం లక్ష్మి ఆరోపించారు. మండలంలోని మోటాపురంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళా సాధికారిక స్వేచ్ఛ, సమానత్వాన్ని సాధించాలని సూచించారు. మహిళలపై నేటికి లైంగికదాడులు, అత్యాచారాలు, గృహహింసలు జరుగుతున్నా వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీటు నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, ఐద్వా నాయకులు జ్యోతి, వీరమ్మ, పద్మ, కుమారి, సరస్వతి, వాణి, వెంకటమ్మ, శౌర్య తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



నిరీక్షించి.. నీరసించి!



నేలకొండపల్లిలో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ఆర్టీసీ ప్రయాణికులకు నీడ కరువైంది. మహిళలకు ఉచిత ప్రయాణం వచ్చినప్పటి నుంచి ప్రయాణికుల రద్దీ పెరగగా.. వారు బస్సు కోసం వేచి ఉండేందుకు అవసరమైన బస్ షెల్టర్లు నిర్మించలేదు. దీంతో ఎండలో నిరీక్షించి నీరసించిపోతున్నారు. ఈ విషయమై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నేలకొండపల్లి మండల కేంద్రానికి నిత్యం వందలాది మంది ప్రజలు వివిధ పనుల నిమ్మిత్తం వస్తుంటారు. తిరుగు ప్రయాణంలో బస్సు కోసం వేచి ఉండేందుకు బస్సు షెల్టర్ లేకపోవడంతో నీడ కోసం చెట్లు, దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. కొందరు ఎండ తీవ్రత తట్టుకోలేక.. ఆటోలపై వెళ్తున్నారు. ఇకనైనా బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– నేలకొండపల్లి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 రమేష్, ACO-9059115968
ఖమ్మం ఎస్.ఉపేందర్ - 99591 24151 వైరా ఐ. రాందాస్ - 98898 8184
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 సత్తుపల్లి జి. బాబు - 79979 58225
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండంత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎన్. శేషయ్య - 99121 99148
జి. నర్సింహారెడ్డి - 97054 44181
ఎస్.కె. పాషా - 97054 44182
పి. నందకుమార్ - 90102 99957